త్రివర్ణశోభితం


రాజాం: మున్సిపల్ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు


తెర్లాం: తెర్లాం వీధుల్లో 400 మీటర్ల భారీ జాతీయ జెండాను ఊరేగిస్తున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు


రాజాం: మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ లావేటి సులోచన, అధికారులు, ప్రజాప్రతినిధులు


రేగిడి: ఉప్పర్నాయుడువలసలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం


రేగిడి: తహసీల్దార్ కార్యాలయం వద్ద పంద్రాగస్ట్ వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. వాడవాడలూ త్రివర్ణ శోభితంగా మారిపోయాయి. రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల్లో పంద్రాగస్ట్ వేడుకలు ఘనంగా జరిగాయి. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో మంగళవారం జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. రాజాం పట్టణంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. బొబ్బిలి పట్టణంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్, బొబ్బిలి/రాజాం

- ఘనంగా 77వ స్వాతంత్య్ర వేడుకలు
- వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు


బాడంగి: మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎంపీపీ గౌరి, తదితరులు


సంతకవిటి: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో దేశభక్తి గీతానికి చిన్నారుల నృత్య ప్రదర్శన


బొబ్బిలి: సీహెచ్‌సీ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


రామభద్రపురం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, అధికారులు


రామభద్రపురం: తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ రాజారావు, తదితరులు


వంగర: వంగర గ్రామ సచివాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ


వంగర: మండల పరిషత్ కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ


బొబ్బిలి: ఆర్డీఓ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఆర్డీఓ పి.శేషశైలజ


రాజాం సిటీ: కోర్టు సముదాయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు


బొబ్బిలి: పోలీసులకు పతకాలు అందజేస్తున్న డీఎస్పీ శ్రీధర్, సీఐ నాగేశ్వరరావు


తెర్లాం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ లూర్దు, ఎంపీడీఓ రామకృష్ణ


బాడంగి: రెవెన్యూ కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ చిన్నంనాయుడు


తెర్లాం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన్న వేడుకల్లో కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


బొండపల్లి(మెంటాడ): మెంటాడలో విద్యార్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు


సంతకవిటి: కొండగూడేం పాఠశాలలో విద్యార్థులతో కలిసి పంద్రాగస్ట్ వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు


రాజాం సిటీ: పెనుబాక సచివాలయం వద్ద జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ నర్సింహులు

క్లుప్తంగా

స్థల పరిశీలన

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద ఉన్న జగనన్న కాలనీకి వెల్‌కం ఆర్చ్ నిర్మాణం చేసేందుకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మున్సిపల్, హౌసింగ్ అధికారులతో కలిసి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెలాఖరున సామర్లకోటలో జగనన్న కాలనీని ప్రారంభించనున్న నేపథ్యంలో.. ఇక్కడి కాలనీని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. రూ.5.80 లక్షలతో వెల్‌కం ఆర్చ్‌కు సంబంధించిన వర్క్ ఆర్డర్‌ను జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే నివేదించినట్టు చెప్పారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య, ఏఈ అల్లు సూర్యనారాయణ తదితరులున్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

రామభద్రపురం: స్థానిక ఎగువ హరిజనవీధి ప్రాథమిక పాఠశాలకు స్థానిక వ్యాపారి మాదేటి వేణు రూ.10 వేలు విలువైన జిరాక్స్ ప్రింటర్‌ను మంగళవారం వితరణ చేశారు. అలాగే మండలంలోని పాడివానివలస ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు వ్యాపారి బందారు నాగరాజు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్టా రామారావు, గుర్రాల ఈశ్వరరావు, డర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు నగదు విరాళం

బాదంగి: మండలంలోని కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు తెంటు సత్యంనాయుడు మాస్టారు రూ.10 వేలు విరాళం అందజేశారు. ఆయన భార్య భారతి జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.మధుసూదనరావు చేతులమీదుగా హెచ్‌ఎం శ్రీదేవికి అందజేశారు. పదోతరగతి పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు సమకూర్చేందుకు ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు.

శాంతియుత ర్యాలీ

బొబ్బిలి: మణిపూర్‌లో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మండలంలోని అలజంగి గ్రామంలో మంగళవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీబీఎం చర్చి పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, అక్కడి మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

సంక్షిప్తంగా..

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

బొబ్బిలి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పరిమి రాజేశ్వరరావు హాజరవుతారని వెల్లడించారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పిరమిడ్ ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

రాజాం సిటీ: శ్వాసమీద ధ్యాస పెడుతూ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని హిమాలయ యోగి సంత సదానందగిరి మహారాజ్ అన్నారు. స్థానిక చీపురుపల్లి రోడ్డులో ఉన్న వెంకటేశ్వర కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పిరమిడ్ ధ్యానంతో కలిగే ఉపయోగాలను వివరించారు. ధ్యానం దివ్య ఔషధమని, మానసును ప్రశాంతంగా ఉంచుకునేందుకు, రోగనిరోధక శక్తి, జ్ఞాపకశక్తిని పెంచుకునేందుకు ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు కొంత సమయాన్ని ధ్యానం కోసం కేటాయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. రాజాం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు కొత్తా రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకం అందజేత

రేగిడి: ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివి ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందిన కొరికాన మధన్, కింజరాపు వెంకటసాయిలకు మంగళవారం నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఎంపీటీసీ కింజరాపు సురేష్‌కుమార్, సర్పంచ్ కొబగాన ముత్యాలమ్మ ఒక్కో విద్యార్థికి రూ.3 వేలు చొప్పున అందజేశారు. పాఠశాల విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకుని బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగభూషణరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ నక్క విజయలక్ష్మి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి(మెంటాడ): మెంటాడ మండలం కుంటినవలస గ్రామంలో శ్రీసిద్ధి వినాయక దత్తాత్రేయ షిర్డీసాయి ఆలయం 8వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త షేక్ హుస్సేన్, అర్చకులు కాశీ కాశీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీఎస్సార్ సేవలు వెలకట్టలేనివి

బొండపల్లి(మెంటాడ): వైద్యరంగంలో డాక్టర్ బి.ఎస్.ఆర్.మూర్తి చేసిన సేవలు వెలకట్టలేనివని మెంటాడ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు అన్నారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణంలో మంగళవారం బీఎస్సార్ మూర్తి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యుడిగా, సామాజిక కార్యకర్తగా ఈ సమాజానికి ఆయ న అందించిన సేవల ను గుర్తుచేసుకుని కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ జాతీయ నాయకులు గంట్రేటి అప్పలనాయుడు, రెడ్డి రాజగోపాల్, శ్రీరామ్మూర్తి, ఎస్.గురునాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

యువత సామాజిక కార్యక్రమాలు చేపట్టాలి

రేగిడి, వంగర: గ్రామీణ ప్రాంత యువత సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. 'నా భూమి–నా దేశం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వన్నలి, ఆడవరం, కొమెర తదితర గ్రామాల్లో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని యువత మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గార రమణ, మొయ్యి కృష్ణమూర్తినాయుడు, పాడి లక్షున్నాయుడు పాల్గొన్నారు. వంగర మండలం కొండచాకరాపల్లి పాఠశాల ఆవరణంలో నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

పెనుబాకలో మొక్కల పంపిణీ

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామ సచివాలయం వద్ద సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు జెడ్పీటీసీ బండి నర్సింహులు మంగళవారం వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. వాటిని గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా, సచివాలయం ఆవరణలో నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి బోడమ్మ, ఎంపీటీసీ కోటీశ్వరి, ఎంపీడీఓ శంకరరావు, ఏపీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు

వంగర: ఉద్యోగులు వారికి అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తే గుర్తింపు వస్తుందని వంగర సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ అన్నారు. స్థానిక సచివాలయంలో కార్యదర్శి సవలాపురపు రామారావును మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పథకాలను అర్హులకు వర్తింప చేయడంతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో చిత్తశుద్ధి కనబరుస్తున్నందుకు ఆయన్ను సత్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కనగల పారినాయుడు, బెవర అప్పలనాయుడు, గొండేల సత్యం మాస్టారు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాల్తేరు బరిలో ఇద్దరు అభ్యర్థులు

బాడంగి: మండలంలోని పాల్తేరు పంచాయతీ 6వ వార్డు మెంబర్ స్థానానికి ఈ నెల 19న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. నామినేషన్ విత్‌డ్రా గడువు పూర్తికావడంతో ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ప్రకటించి వారికి అధికారులు గుర్తులు కేటాయించారు. 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, అనంతరం కౌంటింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 180 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఘనంగా గ్రామదేవత పండగ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి డోలపేటలో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు భక్తులు ఘటాలతో బురదలపోలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి చల్లదనం చేశారు. గ్రామస్తులను చల్లంగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఉత్సవాల సందర్భంగా డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

నేడు బొద్దాంలో 'గడపగడపకు..'

రాజాం: మండలంలో బొద్దాం గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని అన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

దోమల నివారణ చర్యలు

రేగిడి: మండలంలోని గుళ్లపాడు పంచాయతీ పరిధి గుళ్లపాడు, వండానపేట, కె.ఎం.వలస గ్రామాల్లో దోమల నిర్మూలనకు మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. సర్పంచ్ వియ్యపు చక్రపాణి, ఈఓపీఆర్డీ హేమసుందరరావు ఫాగింగ్‌ను పర్యవేక్షించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మాంసం వ్యాపారులకు జరిమానా

బొబ్బిలి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాంసం విక్రయం నిషేదం. అయినప్పటికీ వీధుల్లో మాంసం విక్రయించిన ఇద్దరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. పాత బొబ్బిలికి చెందిన పీర్ సాహెబ్‌కు రూ.2 వేలు, పార్వతీపురం నుంచి గొడ్డు మాంసం తెచ్చి విక్రయిస్తున్న లక్ష్మణరావు అనే వ్యాపారి నుంచి రూ.3 వేలు జరిమానా వసూలు చేశారు.